ఏసుక్రీస్తు రాకతో ప్రపంచం పునీతం

- అంగరంగ వైభవంగా క్రిస్మస్ వేడుకలు
- తెల్లవారుజాము నుంచి చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు

తాడేపల్లి రూరల్ : మంగళగిరి– తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధితో పాటు దుగ్గిరాల మండల రిధిలో క్రిస్మస్ పండుగను సోమవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే భక్తులు నూతన వస్త్రాలు ధరించి, చర్చికి వెళ్లి ప్రత్యేక ప్రార్థనలో పాల్గొన్నారు. పలుచోట్ల చర్చిల్లో పాస్టర్లు ఏసు ప్రభువు సందేశాన్ని ప్రజలకు వివరించారు. లోక కల్యాణం, ప్రపంచ శాంతి కోసం ఏసు క్రీస్తు తిరిగి వస్తాడని, ఆయన రాకతో ఈ ప్రపంచం పునీతం అవుతుందని తెలిపారు. తాడేపల్లి పట్టణ పరిధిలోని ఆర్‌సీఎం మేరీమాత ఆలయంలో ఏసుక్రీస్తు పాటలతో నిర్వహించిన కోలాటం ఆకట్టుకుంది. ప్రాతూరు, గుండిమెడ, ఉండవల్లి, పెనుమాక, చిర్రావూరు, మెల్లెంపూడి, కొలనుకొండ వడ్డేశ్వరం, ఇప్పటం గ్రామాల్లోనూ పాస్టర్లు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. దుగ్గిరాల గ్రామ పరిధి, పెదపాలెం, చిన్నపాలెం, రేవేంద్రపాడు, తుమ్మపూడి, చిలువూరు, తదితర గ్రామాల చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి పాస్టర్లు సందేశాల్ని అందజేశారు.

త్యాగానికి, కరుణకు మారుపేరు ఏసు ప్రభువు

క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకుని మంగళగిరి వైఎస్సార్ సీపీ సమన్వయకర్త గంజి చిరంజీవి సోమవారం పలు ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించి, ప్రజలకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. తాడేపల్లి పట్టణ పరిధిలోని ప్రకాష్‌నగర్, తెనాలి రోడ్డులోని తెలుగు బాప్టిస్ట్ చర్చిల్లో నిర్వహించిన క్రిస్మస్ వేడుకల్లో పాల్గొని, కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా చిరంజీవి మాట్లాడుతూ ఏసు ప్రభువు త్యాగానికి, కరుణ, గొప్పతనానికి మారుపేరని తెలిపారు.

కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులతో పాటు ఫాదర్లు, సంఘ కాపర్లు, సంఘ పెద్దలు పాల్గొన్నారు.



తాడికొండ లూథరన్ చర్చిలో క్రిస్మస్ సందేశాన్ని అందిస్తున్న పాస్టర్ రెవరెండ్ జాకబ్



మేరీమాత గ్రామోత్సవం నిర్వహిస్తున్న రక్షకుని మాత ఆలయ కమిటీ సభ్యులు

మానవాళి రక్షణకే కన్యక గర్భాన క్రీస్తు జననం

తాడికొండ: సర్వమానవాళికి రక్షణ, పాపులను సన్మార్గంలో నడిపించేందుకే కన్య మరియ గర్భాన క్రీస్తు జన్మించారని తాడికొండ లూథరన్ సంఘ కాపరి పాస్టర్ జాకబ్ తెలిపారు. క్రిస్మస్‌ను పురస్కరించుకొని తాడికొండ, తుళ్లూరు మండలాల్లో వేడుకలు ఘనంగా నిర్వహించారు. చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి, క్రీస్తు పుట్టిన రోజుకు సంబంధించి బైబిల్‌లో పొందుపరిచిన విశేషాల్ని పాస్టర్లు వివరించారు. భక్తులు పెద్దఎత్తున చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. సర్వలోకానికి రక్షణ కల్పించేందుకు మనుష్య కుమారుడుగా జన్మించిన క్రీస్తు బోధనలు ప్రజల్ని పాపం నుంచి విముక్తుల్ని చేశాయని తెలిపారు.

వైభవంగా మేరీ మాత గ్రామోత్సవం

తాడేపల్లి రూరల్ : తాడేపల్లి పట్టణ పరిధిలోని 1వ వార్డు రక్షకుని మాత ఆలయంలో క్రిస్మస్ సందర్భంగా మేరీమాతకు సోమవారం రాత్రి చర్చి కమిటీ సభ్యులు గ్రామోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా మేరీమాతను ట్రాక్టర్‌పై ప్రత్యేకంగా అలంకరించారు. 1వ వార్డు నుంచి ఉండవల్లి సెంటర్, పోలకంపాడు వెళ్లి, అక్కడ నుంచి పోలీస్‌స్టేషన్ వరకు గ్రామోత్సవం నిర్వహించారు. చర్చి కమిటీ ఆధ్వర్యంలో కోలాటం నిర్వహించారు.మేరీ మాతను దర్శించుకున్న వారికి చర్చి ఫాదర్ పెద్దిబొట్ల జోజీ ఆశీర్వాదాలు అందజేశారు.



ఉండవల్లి క్రీస్తు కృప లూర్థరన్ దేవాలయంలో ప్రార్థనలు



క్రీస్తు సందేశాలను వివరిస్తున్న పాస్టర్ ఎం. విజయ్‌రావు



తాడేపల్లి పట్టణ పరిధిలోని ఆర్‌సీఎం మేరీమాత ఆలయంలో ఏసుక్రీస్తు పాటలతో కోలాటం



మంగళగిరిలో సంఘ కాపరులతో కలసి కేక్ కట్ చేస్తున్న గంజి చిరంజీవి

దేవాది దేవుడు మానవుడై జన్మించెను



వాక్యోపదేశం చేస్తున్న చిన్నాబత్తుని భాగ్యయ్య

ఫిరంగిపురం: దేవాది దేవుడు లోక రక్షణ కోసం మానవ రూపంలో జన్మించాడని గుంటూరు నేత్రాసన గురువులు చిన్నాబత్తిని భాగ్యయ్య తెలిపారు.మండల కేంద్రంలోని బాల ఏసు దేవాలయంలో క్రిస్మస్ పర్వదినం పురస్కరించుకుని సోమవారం దివ్య పూజా బలి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన వాక్యోపదేశం చేస్తూ పరలోకంలో ఉన్న దేవాది దేవుడు భూలోకంలో మానవుల్ని రక్షించేందుకు పేదింటి మహిళ మరియమాతకు జన్మించారని తెలిపారు. ఆయనే సర్వశక్తుడైన క్రీస్తు అని చెప్పారు. అనంతరం క్రీస్తు జన్మించినందుకు గుర్తుగా పావురాన్ని ఎగురవేశారు. బాలుడైన క్రీస్తు ప్రతిమను ముద్దాడారు. కార్యక్రమానికి ముందుగా నేత్రాసన గురువుల్ని బిషప్ బంగ్లా వద్ద నుంచి ప్రార్థన నిర్వహించే స్థలం వద్దకు మేళతాళాలతో భక్తులు తీసుకొచ్చారు.అనంతరం బాల ఏసు దేవాలయంలో నూతనంగా ఏర్పాటు చేసిన మరియమాతా విగ్రహాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో బాల ఏసు దేవాలయం విచారణ గురువులు పి.బాలస్వామి, మఠకన్య స్త్రీలు, క్రైస్తవ భక్తులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఘనంగా ఎమ్మెల్యే సుచరిత జన్మదిన వేడుకలు



తాడికొండ: ప్రత్తిపాడు ఎమ్మెల్యే, తాడికొండ నియోజకవర్గ ఇన్‌చార్జి మేకతోటి సుచరిత జన్మదిన వేడుకలు సోమవారం గుంటూరులోని ఆమె కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని పలు మండల, గ్రామాలకు చెందిన కార్యకర్తలు, నాయకులు అధిక సంఖ్యలో ఆమెను ఘనంగా సత్కరించారు. కేకును కత్తిరించి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మేకతోటి సుచరిత, దయాసాగర్ దంపతుల ఆధ్వర్యంలో పేదలకు భారీ అన్నదానం జరిపారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరిక



తాడేపల్లిరూరల్ : మంగళగిరి పట్టణానికి చెందిన చేనేత వస్త్ర ఉత్పత్తి విక్రయదారుల సంఘం అధ్యక్షుడు పెండెం శివరామకృష్ణ (సిటీ కేబుల్ శివరాం) టీడీపీని వీడి సోమవారం మంగళగిరి సమన్వయకర్త గంజి చిరంజీవి ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీలో చేరారు. ఆయనకు చిరంజీవి కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా పెండెం శివరామకృష్ణ మాట్లాడుతూ మంగళగిరి ఎమ్మెల్యే సీటును వైఎస్సార్ సీపీ బీసీలకు ఇవ్వడం సంతోషించదగ్గ విషయమని పేర్కొన్నారు. తెలుగుదేశం పార్టీ నేతలు గతంలో ఒత్తిడి తీసుకురావడం వల్లే ఆ పార్టీలో చేరానన్నారు. చిరంజీవి చిన్ననాటి స్నేహితుడని, మంగళగిరిలో ఆయన్ను గెలిపించి బీసీల సత్తా చాటుతామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు మునగాల మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడు ప్రసాద్‌కు మిరాకిల్స్ వరల్డ్ అవార్డు



గుంటూరు ఎడ్యుకేషన్: శుభాంజలి కళావేదిక వ్యవస్థాపకుడు, గాయకుడు, ఉత్తమ ఉపాధ్యాయుడు మేకల పురుషోత్తమ ప్రసాద్ మిరాకిల్స్ వరల్డ్ రికార్డ్ అందుకున్నారు. అమరావతి రోడ్డులోని అన్నదాన సమాజంలో ఇటీవల జరిగిన కార్యక్రమంలో 12 గంటల పాటు 129 ఘంటసాల గీతాల్ని నిర్విరామంగా ఆలపించడం ద్వారా మిరాకిల్స్ సంస్థ అవార్డును ప్రకటించింది. ఈ సందర్భంగా సోమవారం అరండల్‌పేటలో జరిగిన కార్యక్రమంలో ఉపాధ్యాయుడు పురుషోత్తమ ప్రసాద్‌ను ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల సుబ్బారావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె. నరసింహారావు, డెమోక్రటిక్ పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు జువ్వా జ్ఞానేశ్వరరావు, బీసీ ఉద్యోగ సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి వరగాని శివనాగేశ్వరరావు, సాధం సత్యనారాయణ అభినందించారు.

మను స్మృతి ప్రతుల దహనం

నెహ్రూనగర్: లాడ్జి సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద దళిత, బహుజన సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం మను స్మృతి ప్రతుల్ని దహనం చేశారు. ఈ సందర్భంగా వీసీకే పార్టీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు కె.జయసుధ మాట్లాడుతూ ఎస్సీ బీసీ మైనార్టీ, మహిళల హక్కుల్ని కాలరాచే మను స్మృతిని బాబాసాహెబ్ దహనం చేశారని గుర్తు చేశారు. మనువాద శక్తులు భారత రాజ్యాంగాన్ని తొలగించి, మనుస్మృతిని అమలు చేయాలని డిమాండ్ చేయడం దేశాన్ని అనాగరిక స్థితిలోకి తీసుకు వెళ్లడమేనని విమర్శించారు. మనువాద శక్తుల నుంచి అంబేడ్కర్ రచించిన రాజ్యాంగాన్ని కాపాడుకోవాలని ఆమె కోరారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడికి తీవ్ర గాయాలు

తెనాలి రూరల్: రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పట్టణ మారీసుపేటకు చెందిన 72 ఏళ్ల సుభాని ఆదివారం రాత్రి ఫస్ట్‌షోకు సినిమాకు వెళ్లారు. 10.30 గంటల సమయంలో స్కూటీపై ఇంటికి వెళుతుండగా గిరి రోడ్డులో ఎదురుగా వచ్చిన కారు ఢీకొట్టడంతో తలకు, కాళ్లకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు గమనించి కుటుంబసభ్యులకు సమాచారం అందించగా ప్రకాశం రోడ్డులోని ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. వైద్యశాల నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసినట్టు త్రీ టౌన్ ఎస్‌ఐ వెంకటేశ్వరరావు సోమవారం తెలిపారు.

'ఆడుదాం ఆంధ్రా'తో క్రీడాకారుల ప్రతిభకు ప్రోత్సాహం

తాడేపల్లి రూరల్ : దేశంలో ఏ ప్రభుత్వం నిర్వహించని విధంగా రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్. జగన్ మోహన్‌రెడ్డి క్రీడాకారుల్ని ప్రోత్సహించేందుకు ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని మాజీ మంత్రి, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, ఆప్కో చైర్మన్, మంగళగిరి వైఎస్సార్ సీపీ సమన్వకర్త గంజి చిరంజీవి పేర్కొన్నారు. ఎంటీఎంసీ పరిధిలో నేటి నుంచి పోటీలు నిర్వహించనున్న సోమవారం కమిషనర్ నిర్మల్ కుమార్‌తో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, సమన్వయకర్త గంజి చిరంజీవి మాట్లాడుతూ ఎంటీఎంసీ పరిధిలో మొత్తం 12 ఆట స్థలాల్ని అధికారులు సిద్ధం చేశారని తెలిపారు. గుంటూరు జిల్లా నల్లపాడులో ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి క్రీడల్ని ప్రారంభించగానే ఎంటీఎంసీ పరిధిలో ఆటల పోటీలు జరుగుతాయని చెప్పారు. మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని 65 సచివాలయాల్లో ఇప్పటికే క్రీడల్లో పాల్గొనేందుకు 19,148 మంది, వీక్షించేందుకు 12,053 మంది పేర్లను నమోదు చేసుకున్నారని వెల్లడించారు. గతంలో నమోదు చేసుకున్న క్రీడాకారులే కాకుండా అప్పటికప్పుడు పేర్లు నమోదు చేసుకుని అధికారుల అనుమతితో క్రీడల్లో పాల్గొనవచ్చని వారు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మంగళగిరి పట్టణ అధ్యక్షులు మునగాల మల్లేశ్వరరావు, డెప్యూటీ కమిషనర్ బిక్కిరెడ్డి శివారెడ్డి, ఎంటీఎంసీ సెక్రటరీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.



డాన్‌బాస్కో స్కూలులో ఆట స్థలాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ హనుమంతరావు, చిరంజీవి



దుగ్గిరాలలో ఆట స్థలాలను పరిశీలిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

దుగ్గిరాలలో....

మండల పరిధిలోని 18 గ్రామాల్లో జరిగే ఆడుదాం ఆంధ్రా క్రీడలకు ఎంపీడీవో వీరయ్య క్రీడా ప్రాంగణాలను సిద్ధం చేశారు. సోమవారం వాటిని దుగ్గిరాల ఎంపీపీ దానబోయిన సంతోష రూపవాణి, వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు దానబోయిన వెంకటేశ్వరరావు పరిశీలించారు. కార్యక్రమంలో దుగ్గిరాల వైస్ ప్రెసిడెంట్ నాగూర్, బాజీ, జమ్ముల లోకేష్, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

'ఆడుదాం ఆంధ్రా'ను విజయవంతం చేయండి

తాడేపల్లి రూరల్ : 'ఆడుదాం ఆంధ్రా'ను విజయవంతం చేయాలని ఎంటీఎంసీ కమిషనర్ నిర్మల్ కుమార్ సిబ్బందికి సూచించారు. మంగళవారం నుంచి జరుగనున్న క్రీడల కోసం ఏర్పాటు చేసిన ఆట స్థలాల్ని డెప్యూటీ కమిషనర్ శివారెడ్డి, సెక్రటరీ శ్రీనివాసరావులతో కలసి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్మల్ కుమార్ మాట్లాడుతూ ఒక్కొక్క గ్రౌండ్ పరిధిలో 5 నుంచి 7 సచివాలయ పరిధిలో క్రీడలను నిర్వహిస్తున్నామని తెలిపారు. సచివాలయ పరిధిలోని సిబ్బంది అందరూ ఈ ఆటల పోటీల ఏర్పాట్లను నిరంతరం పరిశీలిస్తారన్నారు. క్రీడాకారుల్ని ఆహ్వానించడంతో పాటు కొత్తగా పేర్లు నమోదు చేసేందుకు హెల్ప్ డెస్క్‌ను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ప్రతి క్రీడా ప్రాంగణంలో ఎమర్జెనీ వైద్య నిమిత్తం సిబ్బందిని అందుబాటులో ఉంచనున్నామని, 12 ఆట స్థలాలకు సంబంధించి 108 వాహనాన్ని కూడా సిద్ధంగా ఉంచనున్నట్లు ఆయన తెలిపారు. క్రీడాకారులకు తాగునీటితో పాటు మౌలిక సదుపాయాల్ని కల్పిస్తున్నామని ఆయన చెప్పారు.

మాజీ ప్రధాని వాజ్‌పేయికి ఘన నివాళి

గుంటూరు మెడికల్: మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి జయంతి సందర్భంగా బీజేపీ జిల్లా కార్యాలయంలో సోమవారం ఆయన చిత్రపటానికి నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు వనమా నరేంద్ర కుమార్ మాట్లాడుతూ వాజ్‌పేయి రాజకీయాలకు అతీతంగా దేశాభివృద్ధి, ఆత్మనిర్భరతే లక్ష్యంగా సుపరిపాలనతో ప్రజాభిమానాన్ని చూరగొన్నారని పేర్కొన్నారు. సీనియర్ నాయకుడు జూపూడి రంగరాజు మాట్లాడుతూ వాజ్‌పేయి జీవితం ఎంతోమందికి ఆదర్శనీయమని తెలిపారు. రాష్ట్ర అధికార ప్రతినిధి వల్లూరు జయ ప్రకాష్ నారాయణ మాట్లాడుతూ వాజ్‌పేయి అని, విలువలతో కూడిన రాజకీయాలు చేశారన్నారు. భారతదేశానికి అణు పరీక్షలు చేసిన ఘనత ఆయనకే దక్కుతుందని తెలిపారు. కార్యక్రమంలో నేతలు కొత్తూరి వెంకట సుబ్బారావు, మకుటం శివ, ఈదర శ్రీనివాసరెడ్డి, యడ్లపాటి స్వరూపరాణి, భీమినేని చంద్రశేఖర్, డాక్టర్ టి.వి.రావు, వెలగలేటి గంగాధర్ పాల్గొన్నారు.

రాజకీయాల్లో రుషితుల్యుడు

లక్ష్మీపురం: విలువలకు పట్టం కట్టిన రాజకీయవేత్తగా దేశ ప్రజల మనస్సుల్లో ఎప్పటికీ అటల్ బిహారీ వాజ్‌పేయి నిలిచి ఉంటారని రాజనీతి శాస్త్ర అధ్యాపకులు ఎస్.తిరుపతయ్య, అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి కొనియాడారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో వాజ్‌పేయి జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాజ్‌పేయి రాజకీయాల్లో రుషితుల్యుడని పేర్కొన్నారు. కార్యక్రమంలో రచయిత్రి ఎ.వి.కె. సుజాత, యోగాచార్యులు అచ్యుత ఇందుశేఖర్, సంస్థ సభ్యులు పాల్గొన్నారు.



వాజ్‌పేయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న బీజేపీ నేతలు



వాజ్‌పేయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న అవగాహన సంస్థ సభ్యులు

గోల్డెన్ అవర్‌లో రక్షణకు ధర్మ టెలీ హెల్త్ ప్రాజెక్టు

- గుండెపోటు వచ్చిన గంటలోపే వైద్యం
- టెలీమెడిసిన్ సేవలతో రోగులకు సేవలు
- డీ3 శారద సర్వీస్ సొసైటీ మరో వినూత్న ఉచిత సేవ
- నేడు పెదరావూరులో ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ ప్రారంభం

తెనాలి: గుండెపోటు సంభవించిన మొదటి గంట కీలకం. ఆ వ్యవధిలోనే తగిన వైద్యం అందిస్తే ప్రాణాపాయం లేకుండా చూడొచ్చు. గుండె కండరాలకు నష్టం జరగకుండా నివారించొచ్చు. సరైన అవగాహన లేమి, నేటి న్యూక్లియర్ కుటుంబాల్లో సాయపడే మనిషి లేక ఆసుపత్రికి తీసుకెళ్లటంలో జాప్యం జరుగుతోంది. గుండెపోటు మరణాల్లో 47 శాతం ఆసుపత్రికి తీసుకెళ్లేలోగానే సంభవిస్తున్నాయనే గణాంకాలున్నాయి. అందువల్లనే తొలి గంటను 'గోల్డెన్ అవర్'గా వ్యవహరిస్తున్నారు. తెనాలి పట్టణ మహిళల్లో క్యాన్సర్ నివారణలో కృషిచేస్తున్న డీ3 శారద సర్వీస్ సొసైటీ ఇప్పుడు గోల్డెన్ అవర్‌లో వైద్యసేవలకు ధర్మ టెలీ హెల్త్ ప్రాజెక్టుతో సిద్ధమైంది. రూరల్ మండలం పెదరావూరులో సిద్ధం చేసిన భవనంలో మంగళవారం సాయంత్రం స్థానిక ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ చేతులమీదుగా ప్రారంభించనున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆధునిక వైద్యాన్ని ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చింది. ఎంఆర్ఐ స్కానింగ్, ఆంజియోగ్రామ్ పరీక్షలు, గుండెపోటు సంభవించినపుడు ఖరీదైన ఇంజక్షనుతో సహా అన్ని రకాల వైద్యసేవలు ప్రభుత్వ వైద్యశాలల్లో అందుబాటులో ఉన్నాయి. అయినా అవగాహన లేని ఎందరో ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారు. సమయాన్నీ, డబ్బునూ, ఒక్కోసారి ప్రాణాన్నీ కోల్పోతున్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకునే ధర్మ ప్రాజెక్టును తీసుకొచ్చినట్టు డీ 3 శారద సర్వీస్ సొసైటీ వ్యవస్థాపకురాలు డాక్టర్ శారద చెప్పారు. ఇందులో టెలీ మెడిసిన్ సేవలకు ప్రాముఖ్యతనిచ్చారు. గుండెపోటు, బ్రెయిన్ స్ట్రోక్ సమాచారం రాగానే తొలి గంటలోనే ధర్మ అంబులెన్స్ రోగి ఇంటికి వెళ్లి, ఈసీజీ సహా అన్ని పరీక్షలు చేస్తుంది. సీపీఆర్ చేస్తారు. అవసరమైతే హృద్రోగ నిపుణుడు, న్యూరాలజిస్ట్‌కు కనెక్టు చేస్తారు. డాక్టర్ సలహా ప్రకారం వైద్యం సూచిస్తారు. దగ్గర్లోని ప్రభుత్వ ఆసుపత్రికి లేదా రోగులు కోరుకున్న ఆసుపత్రికి తరలిస్తారు. ఇతర వ్యాధుల్లో రోగులకు నిపుణులు వైద్య సలహాలు ఇస్తారు. రోగులకు అవసరమైన ప్రయాణం, వ్యయం తగ్గిస్తారు. స్థూలంగా ఇదీ ప్రాజెక్టు.

శరీర లక్షణాల ఆధారంగా తలెత్తనున్న జబ్బులను గుర్తించి తగిన జాగ్రత్త, చికిత్సతో ఆ ముప్పు నుంచి తప్పుకునే అవకాశం ఉంది. ఇందుకు భిన్నంగా నేటి సమాజం వ్యాధి బహిర్గతమైనపుడే చికిత్సకు వెళుతోంది. జీవనశైలి వ్యాధులు, సంక్రమించిన వ్యాధుల్లో 60 శాతాన్ని ప్రాథమికంగా నివారించే వీలుంది. దీన్ని దృష్టిలో ఉంచుకుని సత్యసాయి సంస్థల్లో 25 ఏళ్లు వివిధ రకాల సేవలను అందించిన డాక్టర్ శారద, వలంటీర్లను సిద్ధం చేసుకుని ఉచిత వైద్యశిబిరాలను నిర్వహిస్తున్నారు. ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్, మున్సిపాలిటీ సహకారంతో మహిళల్లో క్యాన్సర్ రహిత తెనాలి కోసం విశేషంగా కృషిచేశారు. పట్టణంలోని అన్ని వార్డుల్లో క్యాన్సర్ ఉచిత వైద్యశిబిరాలను ఏర్పాటుచేసి 3,000 మందికి పైగా మహిళలకు రొమ్ము క్యాన్సర్, గర్భాశయ క్యాన్సర్ పరీక్షలు చేశారు. మళ్లీ ఇప్పుడు ధర్మ ప్రాజెక్టుతో జనం ముందుకొస్తున్నారు. కొన్నేళ్ల క్రితం తన తండ్రికి గుండెపోటు సంభవించినపుడు తొలి గంటలో తగిన వైద్యం అందుకోలేని నిస్సహాయ పరిస్థితి, ధర్మ ప్రాజెక్టుకు ప్రేరణ అంటారు డాక్టర్ శారద. ఇందుకోసం కార్డియాలజీకి సంబంధించిన అధీకృత శిక్షణ తీసుకున్నారు. తమ వలంటీర్లు 21 మందికి సీపీఆర్, ఇతర గోల్డెన్ అవర్ వైద్యసేవలపై శిక్షణనిచ్చారు. పెదరావూరులోని మహిళా మండలి తమ భవనాన్ని ఈ ప్రాజెక్టుకు ఇచ్చారు. ప్రత్యేక వాహనం, వైద్యపరికరాలు సిద్ధమైనట్టు చెప్పారు. డాక్టర్ రమేష్ కార్డియాక్ హాస్పటల్, రీసెర్చ్ సెంటర్, విజయవాడ కార్డియాలజిస్టుల ఆన్‌లైన్ పర్యవేక్షణలో తెనాలి, పరిసరాల్లో స్వచ్ఛందంగా గోల్డెన్ అవర్ సేవలను అందిస్తూ, వీలైనంతమందిని రక్షించాలనేది తమ ఆశయంగా వివరించారు.



పెదరావూరులో సిద్ధమైన ప్రాజెక్టు కేంద్రం



అధునాతన అంబులెన్స్



డాక్టర్ డి.శారద

అనారోగ్యంతో మహిళ ఆత్మహత్య

గుంటూరు ఈస్ట్: మహిళ ఆత్మహత్యపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. వికలాంగుల కాలనీలో నివసించే షేక్ సైదాబి (42) కొంతకాలంగా అనారోగ్యంతో బాధ పడుతోంది. దీంతో మానసికంగా కుంగిపోయి సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యానుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

పట్నంబజారు: చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన ఘటనపై కేసు నమోదైంది. బుచ్చయ్యతోటకు చెందిన క్షత్రియ నరేంద్ర సింగ్ (34) నిత్యం మద్యం తాగి తిరుగుతుంటాడు. ఈనెల 14న పూటుగా మద్యం తాగి ఇంటి వద్ద కింద పడడంతో తలకు తీవ్ర గాయమైంది. తల్లిదండ్రులు చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించగా, చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. మృతుడి తల్లి ఈశ్వరీ బాయి ఫిర్యాదు మేరకు కొత్తపేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉద్యోగం పేరిట మోసం

తెనాలి రూరల్: ఉద్యోగం పేరిట సోషల్ మీడియాలో వచ్చిన యాడ్‌ను చూసి డబ్బులు చెల్లించి ఓ యువతి మోసపోయింది. పోలీసుల కథనం ప్రకారం.. పట్టణ ఐతానగర్‌లో నివసిస్తున్న మమత సోషల్ మీడియాలో కొద్ది రోజుల క్రితం సాఫ్ట్‌వేర్ ఉద్యోగం ఇప్పిస్తామన్న యాడ్‌ను చూసి అక్కడ ఉన్న నంబరుకు కాల్ చేసింది. వారు సూచించిన విధంగా రూ. 30 వేలు బ్యాంకు ఖాతాలో జమ చేసింది. అప్పటి నుంచి నంబరు పని చేయకపోవడం, ఎటువంటి సమాచారం లేకపోవడంతో సైబర్ విభాగాన్ని ఆశ్రయించింది. విభాగం నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమదు చేసినట్టు టూ టౌన్ పోలీసులు సోమవారం తెలిపారు.

'కేంద్రియ' విశ్రాంత ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

గుంటూరు ఎడ్యుకేషన్: కేంద్రియ విద్యాలయాల్లో పని చేసి ఉద్యోగ విరమణ పొందిన ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయుల సమస్యల్ని కేంద్రం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని అఖిల భారత కేంద్రియ విద్యాలయాల విశ్రాంత ఉద్యోగుల సంఘ ప్రతినిధులు నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలుకు విజ్ఞప్తి చేశారు. రింగ్ రోడ్డులో సోమవారం క్యాంపు కార్యాలయంలో కలసిన సంఘ ప్రతినిధులు కేవీడీ ప్రసాద్, ఎస్. చలపతి, బి. శివనాగేశ్వరరావు, కేవీపీ ఎస్ఎస్ హైదరాబాద్ రీజియన్ అధ్యక్షుడు బీఎస్వీ సీతారామ్, ఎండీ నసీమ్ ఆయనకు వినతి పత్రం సమర్పించారు. దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న ఎంఏసీపీ సమస్యతో పాటు సీజీహెచ్ఎస్ సదుపాయాల్ని తక్షణమే పునరుద్ధరించే విధంగా సంబంధిత మంత్రిత్వ శాఖ దృష్టికి తీసుకు వెళ్లాలని కోరారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో ప్రారంభానికి నోచుకోని కేంద్రియ విద్యాలయాలను అందుబాటులోకి తెచ్చే విధంగా చర్యలు తీసుకోవడంతో పాటు అమరావతి రీజియన్ ప్రాంతీయ కేంద్రీయ విద్యాలయ సంఘటన్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. కేంద్రియ విద్యాలయాల్లో నిలిపివేసిన గ్రాండ్ చిల్డ్రన్ కోటాను పునరుద్ధరించాలని కోరారు. సంబంధిత మంత్రిత్వశాఖ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు హామీ ఇచ్చారు.